**కథ**

# స్వర్ణనిర్ణయం

**మూర్తి ఇంకా నిద్రలేవకముందే వచ్చి తలుపు తట్టాడు చంద్రశేఖరం. అప్పుడు ఏడు గంటలయింది. రాత్రి గుంటూరులో బస్సెక్కే ముందే ఫోను చేశాడు- తను బయల్దేరుతున్నట్లుగా ఆపైన ఈరోజంతా తను శెలవుపెట్టాలి అంటూ. అందుకే అతడి రాకకు ఆశ్చర్యపోలేదు మూర్తి. తలుపుతీసి తాపీగా సోఫాలో కూర్చున్నాడు.**

''ఇంతకీ ఎవరా అమ్మాయి!''

''నాకూ తెలియదు. మా బాబాయి స్నేహితుడి కూతురట. ఇక్కడే బ్యాంకులో ఉద్యోగమట. అప్సరసలా వుంటుందట. జాతకాలు కుదిరినయ్యట. మా నాన్నకు కూడా వాళ్ళు యిస్తానన్న కట్నకానుకలు నచ్చినయ్యట. నేను 'ఊ' అంటే రేపు కార్తీకమాసంలోనే పెళ్ళి చేసేస్తారట- అదీసంగతి. ఇక చూపులే తరువాయి. ఫోటోలో అయితే నూటికి నూరుమార్కులూ వేసేయవచ్చు!''

''శుభం!'' అన్నాడు చంద్రశేఖరంతో చేతులు కలుపుతూ మూర్తి.

''ముందు నేను ఆ అమ్మాయిని చూసి ఓకే అంటే మా నాన్న, అమ్మ, అక్కయ్య, చెల్లెలు...సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేసి అధికారికంగా పెళ్ళిచూపుల తంతు పూర్తిచేసి ఆమోద ముద్ర వేస్తారు!''

మూర్తి, చంద్రశేఖరం కాలేజీలో కలసి చదువుతున్నారు. తరువాత హైదరాబాద్‌లోనే యిద్దరూ కలిసి ఓ సంవత్సరంపాటు పనిచేశారు. ఆ సమయంలో ఒకే రూంలో వుండి చేతులు కాల్చుకుంటూ వండుకు తిన్నారు. వాళ్ళది పది సంవత్సరాల స్నేహం. ఇద్దరూ అవివాహితులు, ఏ అమ్మాయిని భార్యగా తెచ్చుకోవాలా అని వేటలో వున్నారు.

చంద్రశేఖరం చెప్పాడు మూర్తికి- ఆ అమ్మాయి ఊరు, పేరు, ఎక్కడ పనిచేస్తున్నది, ఎక్కడ వుంటున్నదీ వివరంగా, ఫోటో తీసి చూపించాడు.

''ఇంటికి వెళ్దామా? ఆఫీసుకు వెళ్దామా?''

''ఇప్పుడు మనం ఇంటికి వెళ్ళినా-అంతా ఆఫీసులకు వెళ్ళే హడావుడిలో వుంటారు. అందునా నేను మధ్యాహ్నం పల్నాడుకు వెళ్ళిపోవాలి!'' అన్నాడు చంద్రశేఖరం.

స్వర్ణ పనిచేస్తున్న బ్యాంకు నల్లకుంటలో వున్నది. ఇద్దరూ బ్యాంకు ముందు ఆటో దిగేటప్పటికి పదకొండు గంటలయింది. లోపలకు వెళ్ళి నలువైపులా చూశారు. ఓ పక్కగా కౌంటర్‌లో కూర్చొని టోకెన్లు యిస్తున్న ఆ అమ్మాయిని గుర్తుపట్టారు. ఫోటోకు, విడిగా మనిషికి తేడా లేదు!

మూర్తి ఆ అమ్మాయిని చూస్తూనే చంద్రశేఖరం చేయి పట్టుకొని ఊపుతూ ''అభినందనలు!'' అన్నాడు.

చంద్రశేఖరం ముచ్చటగా నవ్వాడు. కౌంటర్ దగ్గరకు వెళ్ళి ఆ అమ్మాయి ముందు నిలబడి, ''నేను గుంటూరు నుంచి వచ్చానండి. నా పేరు చంద్రశేఖరం. శంకరంగారి అబ్బాయిని. మీ నాన్నగారి స్నేహితుడు రామభద్రంగారు మా బాబాయి'' అన్నాడు చిన్నగా.

ఆ అమ్మాయి అతడి మాటలు వింటూనే ''ఐసీ..నమస్తే. నాన్న చెప్పారు మీరు ఇవ్వాళో రేపో వస్తారని. ప్లీజ్...రెండు నిముషాలు అక్కడ కూర్చుంటే నేను వస్తాను'' అన్నది. స్వర్ణ మాట కూడా చాలా తీయగా వున్నది.

ఆ అమ్మాయి మొఖమూ చంద్రశేఖరాన్ని చూస్తూనే విశాలమవ్వటం మూర్తి గమనించాడు. కించిత్ ఈర్ష్య కూడా కలిగింది. పంచదార చిలకలాంటి అమ్మాయిని వాడుకొట్టేయబోతున్నాడు- అనుకున్నాడు మనసులోనే.

చంద్రశేఖరం కూడా విలాసంగా నవ్వాడు. ఇద్దరూ వెళ్ళి హాల్లో ఒక పక్కగా వున్న విజిటర్స్ కుర్చీలలో కూర్చున్నారు.

బ్యాంకు తెరిచిన మొదటిగంటే అవ్వటంతో జనం బాగా వున్నారు. స్వర్ణ తన ఎదురుగావున్న కస్టమర్స్ అందరినీ పంపితేనేగానీ అక్కడనుంచి రాలేకపోవచ్చు అనుకుంటూ గడియారం చూసుకున్నాడు చంద్రశేఖరం. తను ఒకటీ ముప్పావుకన్నా సికింద్రాబాద్ స్టేషన్‌లో వుండాలి!

తరువాత పది నిముషాలకు స్వర్ణ వాళ్ళ దగ్గరకు వచ్చింది.

చంద్రశేఖరం మూర్తిని పరిచయం చేశాడు. ''నాకు మంచిమిత్రుడు. హైదరాబాద్‌లోనే వుంటున్నాడు'' అంటూ.

స్వర్ణ అన్నది ''ఇంటికి వస్తే బాగుండేదిగదా. ఈ బ్రాంచి ఎప్పుడూ ఇంతే..పనెక్కువ! మీరు సాయంత్రం రాగూడదూ..నాన్నగారితో మాట్లాడవచ్చు!''

''లేదండి. నాకు రేపటినుంచి ఆఫీసులో హడావుడి. అందుకనే రాత్రి బస్సుకు వచ్చాను. మళ్ళీ పల్నాడుకు వెళ్ళిపోవాలి. ఇవ్వాళ రాలేకపోతే మళ్ళీ పదిహేనురోజుల దాకా రాలేనేమోనని హడావుడిగా వచ్చాను. వచ్చేవారం అమ్మనూ నాన్ననూ పంపుతాను. వాళ్ళు మాట్లాడతారు. మీ గురించి రామభద్రం బాబాయి అన్నీ చెప్పాడు. నా వివరాలు ఏమైనా కావాలంటే అడగండి చెబుతాను!'' అన్నాడు చంద్రశేఖరం హుషారుగా.

స్వర్ణ చిన్నగా నవ్వింది. ''మీ బాబాయే మాకూ చెప్పారు మీ గురించి!'' ఆ అమ్మాయి ముఖం ఆ మాట అంటున్నప్పుడు కొద్దిగా కందింది.

సరిగ్గా ఆ సమయంలోనే అటెండర్ వచ్చాడు. ''మేడమ్! మేనేజర్‌గారు పిలుస్తున్నారు!'' అన్నాడు.

''ఒక్క నిముషం...వస్తున్నానని చెప్పు!''

''మేం వెళతాంమరి..సారీ! ఏమీ అనుకోవద్దు. ఆఫీసుకు వచ్చి డిస్టర్బ్ చేసినందుకు!''

''ఫరవాలేదండి..ఉండండి ఒక్క ఐదు నిముషాల్లో వస్తాను!''

చంద్రశేఖరానికి ఇంకా అక్కడ వుండటం అనవసరమనిపించింది. మాట్లాడేదేం లేదు. ముఖ్య కార్యక్రమం చూడటం..చూశాడు. ఆ అమ్మాయికి వంకపెట్టే పనేలేదు!

అందుకే ''లేదులెండి. మేం వెళతాం ఇంకా..మావాళ్ళు ఎప్పుడు వచ్చేది ఫోను చేసి చెబుతాను!'' అంటూ లేచాడు చంద్రశేఖరం. మూర్తీ లేచాడు.

స్వర్ణ థాంక్సు చెప్పి లోపలకు వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిం తరువాత ఒక్క క్షణం ఆగి వాళ్ళూ బయిల్దేరారు బయటకు వచ్చేటందుకు.

తలవంచుకొని గ్రిల్లు దాటుతుంటే ''అరేయ్! చంద్రశేఖరం!'' అన్న పిలుపు వినబడింది. చంద్రశేఖరం ఆగి వెనక్కు తిరిగాడు విచిత్రంగా చూస్తూ.

ఎదురుగ్గా భానుమూర్తి! తన ఊరివాడు. తన చిన్ననాటి స్నేహితుడు.

''ఇదేవిటి ఇక్కడకు వచ్చావ్. హైదరాబాద్‌లోనే వుంటున్నావా నువ్వు కూడా. చాలా కాలమయింది నిన్ను చూసి! నువ్వేనా కాదా అని కాస్త సంశయం కూడా వచ్చింది!''

చంద్రశేఖరం ఆనందంగా అతడి చేయి పట్టుకున్నాడు.

''నువ్వెక్కడ?''

''ఇక్కడే..ఇదే బ్రాంచి! ఏం పనిమీద వచ్చావ్. ఏమైనా హెల్ప్ కావాలా?''

''అదేం కాదు..'' మొఖమాటంగా నవ్వాడు.



''బయటకు రావటానికి వీలవుతుందా నీకు. కాఫీ త్రాగుతూ మాట్లాడుకుందాం!''

''ఏం ఫరవాలేదు పద..కౌంటర్ డ్యూటీ కాదులే నాది!'' అంటూ బయటకు వచ్చాడు వాళ్ళతో. చంద్రశేఖరం- మూర్తిని భానుమూర్తికి పరిచయం చేశాడు.

అంతా ఎదురుగ్గా వున్న ఉడిపి హోటల్లో ఎదురెదురుగా కూర్చున్నారు. సప్లయర్ వస్తే చంద్రశేఖరం కాఫీ తెమ్మని చెప్పాడు గడియారం చూసుకుంటూ. పన్నెండు గంటలయింది. ఇంకా పల్నాడుకు రెండు గంటలు టైం వున్నది.

''స్వర్ణ గురించి వచ్చాం..చూశాను. ఇక బయల్దేరదామనుకుంటుండగా నువ్వు కనబడ్డావ్. చాలా సంవత్సరాలయిందిరా నిన్ను చూసి!''

''స్వర్ణ మీ బంధువా?'' అడిగాడు భానుమూర్తి.

చంద్రశేఖరం చిన్నగా నవ్వి, ''అన్నీ బాగుంటే బంధువేమిటి నాకు భార్యే కావచ్చు! ఇక్కడే పనిచేస్తున్నావుకదా నువ్వు..ఆ అమ్మాయిని గురించి నీ అభిప్రాయమేమిటి?'' అడిగాడు.

భానుమూర్తి కన్నార్పకుండా చంద్రశేఖరాన్నే చూస్తున్నాడు.

''నిజమా..అభినందనలు..ఆ అమ్మాయి చాలా బాగుంటుంది!''

''అందం గురించి కాదు నేను అడిగింది..మనిషి ఎలాంటిదని..''

కాఫీలు వచ్చినాయి. ముగ్గురూ కప్పుల్ని ముందుకు తీసుకున్నారు.

''కొన్ని ఇబ్బందిరకమైన ప్రశ్నలను ఎవ్వరూ ఎప్పుడూ ఇతరులను అడగకూడదు. నీకు నచ్చింది. వివాహం చేసుకోవాలనుకుంటున్నావ్. చేసేసుకో!'' అన్నాడు నవ్వుతూ భానుమూర్తి.

మూర్తి అతడి మాటలు నచ్చనట్లుగా నుదురు చిట్లించాడు.

''వివాహమనేది జీవితంలో అతిముఖ్యమయిన ఘట్టం. ఒక విధంగా జీవితానికి ముఖ్యమైన మలుపు అదే. అన్నీ తెలుసుకొని ముందుకు వెళ్ళాలి!'' అన్నాడు చంద్రశేఖరం.

భానుమూర్తి ఇబ్బందిగా చంద్రశేఖరం మొఖంలోకి చూశాడు.

''మొఖమాటం కాదు. నిజాలు కావాలి నాకు. నా అదృష్టంకొద్దీ నా చిన్ననాటి స్నేహితుడివి కనబడ్డావ్ అనుకోకుండా అవసరమైన సమయంలో!''

అతడు తలవంచుకున్నాడు. ''నువ్వు అలా మాట్లాడితే నేనేం చేయగలను. మెరిసేదంతా బంగారం అనుకోవటం మన అపోహ. స్వర్ణ అంతే. అందమైన ఆడపిల్ల..సరదామనిషి. నలుగురిలో కలివిడిగా తిరగటానికి వెనుకంజ వేయదు.

**పి.ఎస్.నారాయణ**

బ్రాంచిలో లక్ష కథలున్నాయి. నేనయితే కళ్ళతో చూడలేదు చెవులతో వినటమే. అయినా నిప్పు లేందే పొగరాదనేది సామెత. నన్నేమీ ఇంకా అడగవద్దు!''

''అంటే?'' చంద్రశేఖరం బిగుసుకుపోయాడు.

అతడి మాటలకు అసహనంగా కదిలాడు మూర్తి.

''చెప్పానుగదా అంతకంటే విపులంగా ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో నాకు అర్థం కావటం లేదు. విస్తరిలో అన్నీ వడ్డించి వున్నాయి. ఎవరి అజమాయిషీ లేకపోతే సహజంగా కాకులు వాల్తాయి ఆ విస్తరి మీద. ఆ అమ్మాయికి స్వేచ్ఛ అంటే బహు యిష్టం! సారీ! నేనింకా ఒక్క మాట కూడా మాట్లాడి నీ మనసు కష్టపెట్టను. ఎంత విచ్చలవిడిగా తిరిగే వాళ్ళయినా పెళ్ళయితే మారిన దాఖలాలు చాలా వున్నాయి. ఆ అమ్మాయి మారవచ్చు. నీకు ఆనందాన్ని కలిగించవచ్చు. విష్ యూ ఎ హ్యాపీ మ్యారీడ్ లైఫ్!''

ఆ మధ్యాహ్నం సికింద్రాబాద్ స్టేషన్‌లో పల్నాడు ఎక్కిన చంద్రశేఖరం బండి ఇంకొక్క రెండు నిముషాలలో కదులుతుందనగా ''నాకు ఈ సంబంధం ఇష్టంలేదురా. భానుమూర్తి అంత విపులంగా చెప్పిం తరువాత నాకు ముందుకు అడుగు వేయాలనిపించటం లేదు! సారీ..ఇవాళ నిన్ను అనవసరంగా శ్రమపెట్టాను!'' అన్నాడు.

''నో..నేనందుకు అంగీకరించను. మీ మిత్రుడు భానుమూర్తి ఎలాంటివాడో నీకు తెలుసా?'' అడిగాడు మూర్తి.

''చాలా మంచి ఫ్యామిలీ నుంచి వచ్చాడు. బుద్ధిమంతుడు!''

రైలు కూత కూసింది. ''ఎంతో ఆశతో వచ్చి చాలా నిరుత్సాహంతో వెళ్ళిపోతున్నాను. బై..మా బాబాయి చేత నాకిష్టంలేదని వాళ్ళకు ఫోను చేయిస్తానులే!''

★ ★ ★

## సోనాలీ ఆనందం

**పెళ్ళి చేసుకున్నా సినిమాల్లో నటించడానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తోంది సోనాలిబెంద్రే. ఫ్యాక్షన్ సినిమాలకి పెట్టింది పేరైన బాలకృష్ణ కొత్త చిత్రంలో ఆమె ఆర్తి అగర్వాల్‌తో కలిసి నటిస్తోంది. పల్నాడు చరిత్రని వినూత్నమైన కథాంశంతో తెరకెక్కిస్తున్నారు. మేడికొండ మురళీకృష్ణ నిర్మాత అయిన ఈ చిత్రానికి దర్శకత్వం వహించేది కూడా బి.గోపాల్ కావడంతో బాలయ్య అభిమానులతో పాటు బయ్యర్స్ కూడా ఇప్పటినుంచే ఎంతో ఆసక్తి చూపిస్తున్నారు. పల్నాడులో జరుగుతున్న షూటింగ్‌లో సోనాలీ ఉత్సాహంగా కన్పించింది.**



పదిహేను రోజుల తరువాత ఒకరోజు మధ్యాహ్నం రెండు గంటల సమయంలో మూర్తి నల్లకుంటలోని బ్యాంకుకు ఫోను చేసి, ''స్వర్ణగారు కావాలండి!'' అన్నాడు.

స్వర్ణ లైనులోకి వచ్చింది.

''నా పేరు మూర్తి అండి. ఆమధ్య ఒక రోజు చంద్రశేఖరంతో కలిసి మీ దగ్గరకు వచ్చాను గుర్తున్నానా?''

ఒక్క క్షణం నిశ్శబ్దం. ''చంద్రశేఖరం ఎవరు?'' అన్న ప్రశ్న వచ్చింది అటునుంచి.

''అదే..గుంటురలో శంకరంగారి అబ్బాయి..మీ నాన్నగారి మిత్రులు రామభద్రంగారు వాడికి బాబాయి అవుతారు!''

''ఓ..మీరా చెప్పండి!'' గుర్తించినట్లుగా అన్నది.

''సాయంత్రం బ్యాంకు మూసింతర్వాత ఒక్క అయిదు నిముషాలు మాట్లాడదామనుకుంటున్నాను. మీకు అభ్యంతరం లేకపోతే!''

''ఏ విషయంలో!'' స్వర్ణ ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయలేదు.

''కొన్ని విషయాలు ఫోనులో కంటే ముఖతః చెబితేనే బాగుంటాయి'' అన్నాడు నవ్వి మూర్తి.

మళ్ళీ కాసేపు మౌనం తర్వాత ''ఎన్నింటికి వస్తారు?'' అడిగింది.

''మీ బ్యాంకు అయిదున్నరకు క్లోజ్ అవుతుంది గదా..నేను ఆ సమయానికి అక్కడకు వస్తాను. సారీ ఏమీ అనుకోవద్దు!''

''దట్సాల్ రైట్..రండి!''

సాయంత్రం మూర్తిని చూస్తూనే ఆమె ''మీ మిత్రులు వారి బాబాయిగారి ద్వారా వార్త పంపారు గదా..మళ్ళీ మనస్సేమైనా మార్చుకున్నారా?'' అన్నది నవ్వుతూ.

ఉదయం నుంచి క్షణం తీరిక లేకుండా పనిచేసినా వీసమెత్తు కూడా నలగనట్లున్న ఆమె అందం అతడిని విభ్రాంతి పరుస్తోంది.

''లేదు!''

ఇద్దరూ ఎదురుగా వున్న హోటల్లోకి వెళ్ళి ఓ మూలగా వున్న ఖాళీ టేబుల్ దగ్గర ఎదురెదురుగ్గా కూర్చున్నారు.

''మీ మిత్రుడి నిర్ణయం నన్ను ఎంతగానో సంతోషపరిచింది. అనుమానపు మనిషితో జీవితాంతం ఎదురుదెబ్బలు తింటూ బ్రతికేదానికంటే ఇది నయం కదా! వారి బాబాయి మాకు అన్నీ చెప్పారు!'' అన్నది నవ్వుతూనే స్వర్ణ.

''వాడు వట్టి ఫూల్‌లా బిహేవ్ చేశాడు. వాడు చేసిన తప్పును సరిదిద్దటానికే నేను వచ్చింది!'' అన్నాడు తలవంచుకొని.

''ఎలా సరిదిద్దుతారు?'' అన్నది వింతగా మూర్తి వంక చూస్తూ.

''మీకు అభ్యంతరం లేకపోతే నేను మిమ్మల్ని వివాహం చేసుకుందామనుకుంటున్నాను. నేను మీ కులం వాడినే గనుక- రెండు వైపులా పెద్దలు కూడా అంగీకరిస్తారు!'' అన్నాడు త్వరత్వరగా మూర్తి.

స్వర్ణ మౌనంగా వుండిపోయింది తలవంచుకొని.

సప్లయర్ వస్తే ''రెండు కాఫీ!'' అన్నాడు మూర్తి.

''నాకు చాలా స్ట్రాంగ్‌గా వుండాలి!'' అన్నది సప్లయర్ వంక చూస్తూ స్వర్ణ.

అతడు వెళ్ళిపోయాడు.

''మీరెందుకు అలా నిర్ణయించుకుంటున్నారు. మీ స్నేహితుడి అభ్యంతరం మీకు అభ్యంతరంలా కనబడటం లేదా?'' అన్నది కళ్ళు చికిలించి అతడినే చూస్తూ.

ఆమె ఎలా చూసినా అందంతో మెరుస్తూనే వున్నది.

-ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళమీద పనిలేనివాళ్ళు, పనికట్టుకొని అపవాదులు వేస్తూనే వుంటారు. అది సహజం. వాటిని నమ్మే బలహీనుడు అసలు ఉద్యోగం చేసే అమ్మాయినే వివాహం చేసుకోవాలని అనుకోకూడదు!

''నేను చెప్పానుగదా..వాడు ఫూల్ అని. బంగారాన్ని అంత తెలివి తక్కువ ఆలోచనలతో చేజార్చుకుంటాడని నేననుకోలేదు!''

''నేనే విధంగా బంగారాన్నవుతాను..మీ మిత్రుడి దృష్టిలో కానప్పుడు మీ దృష్టిలో కూడా కాకూడదు-ఎందుకంటే భావసారూప్యత వున్నవాళ్ళే మంచిమిత్రులవ్వగలుగుతారు!'' అన్నది చిరునవ్వుతో స్వర్ణ.

''నేను ఒప్పుకోను. వాడిలాగా చెప్పుడు మాటలు వినటం నాకిష్టం లేదు. ఆరోజున కూడా నేను వాడితో వాదించాను!'' అన్నాడు మూర్తి

దృఢంగా.

''మీ అందం నన్ను కట్టి పడేస్తోంది. నాకు భార్యంటూ ఉంటే మీలాంటి వాళ్ళే వుండాలనేది నా కోరిక!''

స్వర్ణ పకపకా నవ్వింది పెద్దగా. ఆ సమయంలో ఆ హోటల్లో కూర్చున్న వాళ్ళంతా తలతిప్పి తమ వంక చూసేటంత పెద్దగా నవ్వింది.

''అందమైన ఆడపిల్లలను భార్యగా పొందాలనుకోవడం రంగులు వేసిన మేడను కొనుక్కోవటం లాంటిదని నేను ఒకచోట చదివాను!''

మూర్తి నవ్వుతున్న ఆమెను, ఆమె మాటలను వింటూ విభ్రాంతిగా ఆమె ముఖంలోకి చూశాడు.

కాఫీలు వచ్చాయి.

''నిజమండీ! రంగులు వెలసిననాడు ఎంతో ఆప్యాయంగా కొనుక్కున్న ఆ యిల్లు ఎంత అసహ్యంగా కనబడుతుందో తెలుసా..రేపు భార్య కూడా అంతే..ఇద్దరు పిల్లలు పుట్టిం తరువాత చెంపలతోపాటు అందమూ జారిపోయిందనుకోండి-అప్పుడు విడాకులిస్తారా?''

''లేదు-మరింతగా ప్రేమిస్తాను!''

''ఎలా?''

''మొదటిసారి యిద్దరినీ శరీరలావణ్యం, ముఖవర్చస్సు దగ్గరకు జేరిస్తే-తరువాత మనసులు పెనవైచుకుపోయి ఆ బంధం విడదీయరానిదే అవుతుంది.''

''నా మీద ఇంకా నలుగురు లేనిపోని అపవాదులు వేసి మీ మనసును కలుషితం చేసినా కూడానా?'' చాలా సూటిగా అతడిని చూస్తూ అడిగింది స్వర్ణ.

''నేను చెప్పానుగదా-ఒకరు చెప్పిన మాటలు విని అభిప్రాయాలు ఏర్పరుచుకుండేవాడిని కాదు నేను. నన్ను గైడ్ చేసేది నా కళ్ళే!''

''మనిషి మనసు ఎంత బలహీనమైనదంటే..భానుమూర్తిలాంటి వాళ్ళ చేతుల్లో అది ఎప్పుడూ పరాజయం పొందుతూనే వుంటుంది!''

''కాదు..మనసు ఎంత పాషాణమో కూడా నాకు తెలుసు. నేను నిరూపిస్తాను!''

''ఊహూ..మగవాడి పాషాణత్వం స్త్రీని హింసించటానికి మాత్రమే పనికివస్తుంది. పువ్వులా మృదువుగా చూసుకోవటానికి కాదు!''

ఆమెను కన్విన్స్ చేయలేక చేజార్చుకుంటున్నట్లుగా నీరసపడిపోతూ వెనక్కువాలాడు మూర్తి.

ఆమె కాఫీని ఒక గుక్క సిప్ చేసి ''చూడండి మూర్తిగారు! నేను చదువుకున్న దాన్ని కనుకనే మీరు మాట్లాడాలి అంటే మీతోపాటు నేనూ హోటల్లోకి వచ్చి మీ ఎదురుగా కూర్చున్నాను. ఈ దృశ్యం చూసిన భానుమూర్తి లాంటి వాళ్ళు ఎన్ని కథలల్లినా నేను చలించను. కారణం నేను తప్పు చేయటం లేదు గనుక. నేను తప్పు చేయను కూడా. నేను ఈ బ్రతుకులో ఓ అందమైన భవిష్యత్తును కోరుకుంటున్నదాన్ని!''

ఆమె మాటలు చాలా లోతుగా, బరువుగా వున్నట్లనిపించింది మూర్తికి.

చంద్రశేఖరం చేసిన వెధవ పనికి ఆమె మనసు బాగా గాయమైనట్లే అనిపించగా, ''నేను మీ కోరికకు సంపూర్ణత చేకూర్చగలననే దృఢమైన విశ్వాసం నాకున్నది!'' అన్నాడు ఆమె కళ్ళల్లోకే చూస్తూ హృదయపూర్వకంగా.

''రైట్..ఒక పని చేయండి!'' అన్నది ఆమె ఖాళీ కప్పును పక్కకు జరుపుతూ ఒక నిర్ణయానికి వచ్చినదానిలా.

''చెప్పండి!'' ఉత్సాహంగా ముందుకు వంగి అన్నాడు మూర్తి.

''మీరు కొద్ది నెలలు ఆగండి. నా గురించి ఎన్ని ఎంక్వయిరీలు కావాలంటే అన్నీ చేసుకోండి. అప్పటికీ నామీద మీ అభిప్రాయం మారకుండా వున్నట్లయితే, ఆపైన మీ మాటల్లోలా పాషాణంలాంటి మీ హృదయం ఏమాత్రం చలించకుండా వున్నట్లయితే, మీ పెద్దవాళ్ళను మా యింటికి పంపి మావాళ్ళతో మాట్లాడమనండి. అప్పుడు ఆలోచిద్దాం. ఓకే. ఇక వెళ్దామా మరి!''

ఆమె లేచి నిలబడింది.

మూర్తి నీరసంగా లేచి నిలబడ్డాడు- ఆమె తనకు దక్కుతుందా అన్న ఆలోచనతో.

స్వర్ణ యింటికి వచ్చిన గంటకు ఫోను మ్రోగుతుంటే స్వర్ణే ఎత్తింది.

''స్వర్ణగారు కావాలండి!'' అవతలి కంఠం అడిగింది.

''స్వర్ణనే మాట్లాడుతున్నాను. ఎవరు మాట్లాడుతున్నది?''


''నేను చంద్రశేఖరాన్ని గుంటూరు నుంచి మాట్లాడుతున్నాను. పదిహేను రోజుల క్రితం మీ బ్యాంకుకు వచ్చి మీతో మాట్లాడాను! గుర్తుకు వచ్చానా?''

''చెప్పండి!'' చాలా ముభావంగా అన్నది స్వర్ణ.

''నన్ను క్షమించాలి. నా మిత్రుడు భానుమూర్తి రోగ్ అని తెలిసింది తరువాత. వాడి మాటలు విని నేనెంత చెడు నిర్ణయం తీసుకున్నానో నాకు అర్థమయింది. ఇప్పుడు నిజం తెలిసింది గనుక నేను మిమ్మల్ని వివాహం చేసుకోవటానికే నిర్ణయించుకున్నాను. మా బాబాయికి ఈ విషయం చెబితే నన్నే డైరెక్ట్‌గా మాట్లాడమన్నారు. అందుకే ఫోను చేస్తున్నాను''

''ఆయన చాలా మంచి సలహా ఇచ్చారు. చెప్పుడు మాటలు విని అభిప్రాయాలు ఏర్పరుచుకునే అనుమానపు వ్యక్తులను భర్తగా భరించే శక్తి నాకు లేదండి. నేనెంత బోళామనిషినో, నలుగురితో భేషజం లేకుండా మెలుగుతానో అంత సున్నితమైన హృదయాన్ని కలిగినదాన్ని కూడా. గుడ్ బై!'' విసురుగా చేతిలోని ఫోనును క్రెడిల్ మీద పడేసింది స్వర్ణ.

✤



## థ్రిల్లింగ్ కావాలి

**రిస్కీ షాట్‌లు తీసేటప్పుడు హీరో, హీరోయిన్లు చాలా ఇబ్బంది పడుతుంటారు. అందుకే ఇలాంటి రిస్క్‌లు లేకుండా ఉండాలనే డూప్‌లు వాడతారు. నటి భూమికకి రిస్కీ షాట్‌లంటే ఎంతో ఇష్టంట. 'ఇలాంటి సన్నివేశాలు చేస్తున్నప్పుడు ఇబ్బంది అనిపించినా నాకెంతో థ్రిల్లింగ్‌గా ఉంటుంది' అంటోంది భూమిక. సూపర్‌హిట్ చిత్రం ఒక్కడు కోసం ఆమె ఎంతో రిస్క్ తీసుకుంది. 40 అడుగుల పైనుంచి దూకి ఎంతో సాహసం చేశానంటూ తన జ్ఞాపకాల్ని నెమరువేసుకుంది ఈ డేరింగ్ హీరోయిన్.**